వరిపంటకు చివరి 'తడి'

• ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే


సుల్తానాబాద్‌లోని పూసాలలో ఎస్సారెస్పీ కాలువలో సాగునీరు

సుల్తానాబాద్: పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రి, పగలు తేడా లేకుండా శ్రమ పడుతున్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో కెనాల్ నీరు ఆగిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందారు. వాటిని కాపాడేందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తనవంతు ప్రయత్నం చేసి సఫలమయ్యారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి కొరత ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు చివరి తడి నీటిని విడుదల చేసేలా ప్రయత్నించి విజయం సాధించారు.

పంటలకు ప్రాణం..

డీ–83, 86 కాలువల ద్వారా నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని చివరి తడి అందించాలని పలువురు రైతులు ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ చివరి తడితో లాభం చేకూరుతుందని రైతులు భావిస్తున్నారు. రెండు రోజుల నుంచి కెనాల్ ద్వారా సాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా 2.80 టీఎంసీల నీరు రోజూ సరఫరా అవుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

చివరి మూడు మండలాలకు కీలకం..

పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని పలు గ్రామాల్లో చివరి తడి నీరు రావడంతో పంటలకు మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు. కొంత నష్టం జరిగినా మెజార్టీ లాభం జరిగే అవకాశం ఉందని రైతులు, అధికారులు భావిస్తున్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించండి


సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: నగరంలో పారిశుధ్యం మెరుగుపర్చడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించాలని అధికారులు, సిబ్బందిని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌తో కలిసి శానిటేషన్‌పై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై చెత్త పేరుకుపోకుండా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ 100శాతం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎండల తీవ్రత పెరిగే అవకాశాలుండడంతో, ఉదయం పూట త్వరగా విధుల్లోకి వెళ్లి మధ్యాహ్నం 12గంటల వరకు కార్మికులతో పనులు పూర్తి చేయించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనకు నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే డివిజన్లలో ఇంకుడు గుంతలను గుర్తించి వాటిని శుభ్రం చేయించాలన్నారు. సమీక్షలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఆర్‌ఐ శంకర్‌రావు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనుల తనిఖీ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పెద్ద కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులను శనివారం కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తనిఖీ చేశారు. రానున్న వర్షాకాలంలో నీళ్లు నిలవకుండా పెద్ద కాలువల్లో పూడికతీత కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కమిషనర్ తెలిపారు. స్థానిక మల్లికార్జున్‌నగర్‌లోని పెద్ద మురుగునీటి కాలువలో మినీ బ్యాక్ హో లోడర్ యంత్రంతో చేస్తున్న పూడిక తొలగింపు పనులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. వర్షాలు ప్రారంభమయ్యేలోపు నగరంలోని అన్ని పెద్ద కాలువల్లో పూడిక తొలగింపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సూపర్‌వైజర్ అశోక్ పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఆలయ ప్రాంగణాలు శుభ్రం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో శ్రీరామనవమి వేడుకల కోసం స్థానిక శ్రీకోదండ రామాలయంతోపాటు నగరంలో వేడుకలను నిర్వహించే ముఖ్యమైన ఆలయ ప్రాంగణాల్లో పారిశుధ్యం మెరుగుపరుస్తున్నారు. శనివారం శ్రీకోదండ రామాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న పనులను, నగరపాలక కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తనిఖీ చేశారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సూపర్‌వైజర్ అశోక్ ఉన్నారు.

ఇసుక టెండర్లు రద్దు చేయకపోతే ఆందోళన చేస్తాం


దీక్షకు మద్దతు తెలుపుతున్న సీపీఐ నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి మానేరు వాగులో ప్రభుత్వం ఇసుక టెండర్ ఏర్పాటు రద్దు చేయాలని గ్రామస్తులు చేపట్టిన రిలే నిరసన దీక్షలను ఉధృతం చేస్తామన్నారు. శనివారం రిలే నిరసన దీక్షకు సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం సందర్శించి సంఘీభావం తెలిపారు. గుర్రం శ్రీనివాస్, రాజమౌళి, సంతోష్, రమేశ్, స్వామి, ఉదయ్ ఉన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


యాగంలో పాల్గొన్న దంపతులు

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయం 28వ వార్షికోత్సవంతో పాటు అయోధ్య శ్రీరామ మహాయాగం పురస్కరించుకొని శనివారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు వేద పండితులతో లోక కల్యాణార్థం 108 మంది దంపతులతో అయోధ్య శ్రీరామయ్య యాగం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీశ్‌కుమార్, ప్రతినిధులు కలవేణి మల్లేశం, కోరబోయిన సాంబయ్య, లింగమూర్తి, స్వామి, రాకేశ్, తిరుపతి, జనార్దన్, పవన్, ఉదయ్, వెంకటసాయి, సంతోష్, భాగ్యలక్ష్మి, శ్రీలత, ఉష, సునీత, శ్రీవల్లిక, రాణి, ప్రవల్లిక, ఆలయ పూజారి రాంపెల్లి శ్రీనివాస్‌శర్మ ఉన్నారు.

‘అల్ఫోర్స్’లో గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో కార్డియల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యదశలో మధుర జ్ఞాపకాలను నెమరు వేస్తుందన్నారు. పాఠశాలలో యూకేజీ పూర్తి చేసుకుని ప్రైమరీ స్కూల్‌లోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పట్టాలు స్వీకరించి ఉన్నత స్థానంలో నిలవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తప్పనిసరి


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సుల్తానాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి అని హెచ్‌ఎం శారద అన్నారు. శనివారం సుల్తానాబాద్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం కొమురయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నాయకులు సారయ్య ఉన్నారు.

ఐసీహెచ్ చైర్మన్ రాజగోపాలన్‌కు డాక్టరేట్

జ్యోతినగర్: ప్రముఖ ఇండియన్ కాఫీ వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలోని ఇండియన్ కాఫీ హౌస్(ఐసీహెచ్) సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వో.కే.రాజగోపాలన్‌కు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ లభించింది. ప్రముఖ అంతర్జాతీయ యూనివర్సిటీ ఐన్‌స్టీన్ యూనివర్సిటీ రాజగోపాలన్‌కు డాక్టరేట్ పట్టా అందజేసింది. రామగుండం ఎన్టీపీసీలో ఇండస్ట్రియల్ క్యాంటీన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఎన్టీపీసీ ప్రాజెక్టులు, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలలో వందల సంఖ్యలో ఇండస్ట్రియల్ క్యాంటీన్లను ఐసీహెచ్ సంస్థ సమర్థవంతంగా నిర్వహిస్తోంది. సంస్థలో 50ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తూ, ప్రస్తుతం సంస్థ చైర్మన్‌గా రాజగోపాలన్ కొనసాగుతున్నారు. కాగరాజగోపాలన్‌కు డాక్టరేట్ రావడంపై ఎన్టీపీసీ రామగుండం ఐసీహెచ్ సీనియర్ మేనేజర్ ఎం.ఐ.బెన్నీ, మేనేజర్లు, సిబ్బంది తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం అందజేత



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన మెట్టు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా 2005 బ్యాచ్ పదో తరగతి చదివిన క్లాస్‌మేట్స్ మృతుడి కుటుంబానికి రూ.20వేల నగదు అందించారు. గోలి నరేశ్, వడ్లూరి సాగర్, జనగామ అన్వేష్, మధుకర్, కల్వల సందీప్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మత్స్యకార్మికుల వలలు తగలబెట్టడం హేయమైన చర్య

జ్యోతినగర్: మత్స్యకార్మికుల వలలు తగలబెట్టడం హేయమైన చర్య అని పీఎం మత్స్య గంధి యోజన మల్టీపర్పస్ సొసైటీ జిల్లా కన్వీనర్ సుల్వ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం కార్పొరేషన్ మేడిపల్లి శివారు గోదావరి నదిలో జంగాలపల్లెకు చెందిన పలువురు మత్స్యకారులు చేపలను పట్టుకుని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రెండురోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చేపలు పట్టే వృత్తినే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న 20 కుటుంబాలకు చెందిన చేపల వలలు, పడవను దహనం చేయడంతో వారి జీవనోపాధి రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వలలను, పడవను దహనం చేసిన దుండగులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలతో పాటు బాధిత కుటుంబాలకు సత్వరమే న్యాయం జరిగేలా ప్రభుత్వం ఆదుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కూలీలకు అంబలి పంపిణీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులకు శనివారం హాజరైన కూలీలకు సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి అంబలి పంపిణీ చేశారు. నిమ్మరాజుల రజనీ, కాసర్ల రాజేందర్, గుర్రం రాజలింగు, బందారపు సాయి, ఆడెపు శ్రావణ్, రాంపల్లి రాకేశ్, మణిచరణ్, శివ ఉన్నారు.

అంగన్వాడీలో అన్నప్రాసన

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు ఉపాధ్యాయురాలు జి.రజిత అన్నప్రాసన చేశారు. అనంతరం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ హెల్పర్ అరుణ, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వేముల


నియామక పత్రం అందుకుంటున్న రాజమౌళి

జూలపల్లి: మండలంలోని తేలుకుంటకు చెందిన మాజీ ఎంపీటీసీ, చిత్రకారుడు వేముల రాజమౌళిని పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ శనివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తర్వులు అందజేశారు. తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమార్త మురళి, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రం చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.

శ్రీపాదరావు ఆశయాలు కొనసాగిద్దాం


నివాళి అర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రామగిరి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ఆశయాలను కొనసాగిద్దామని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా సెంటినరీకాలనీ శ్రీపాదభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రతీ కార్యకర్త ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్జీ–3 డివిజన్ ఐఎన్‌టీయూసీ నాయకులు మండల కొమురయ్య, రాయమల్లు, ప్రేమ్‌కుమార్, నరేందర్, మహేందర్, మర్రి ఓదెలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర


శోభాయాత్రలో భక్తులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పరిధి రాజాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీభక్త ఆంజనేయస్వామి ఆలయంలో నెలకొల్పే ఉత్సవ విగ్రహాలను శనివారం భక్తులు ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు. ఆదివారం కుంకుమ పూజలు, సోమవారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు తెలిపారు.

ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో ఓటు హక్కు ప్రాధాన్యం, వినియోగంపై శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో కళాకారులు కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు కొండ్ర వెంకన్నగౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, సతేంద్ర రాజన్న, జిన్నా రమ, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక, ఈదునూరి పద్మ పాల్గొన్నారు.

ఉద్యమ సంఘీభావ నిధి సేకరణ

రామగుండం: సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ బీటీ.రణదీవే వర్ధంతి, ఏప్రిల్ 6–14వ తేదీ వరకు అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్ ఇంధన డిపోల్లో పనిచేస్తున్న కార్మికుల నుంచి శనివారం ఉద్యమ సంఘీభావ నిధి సేకరించారు. సామాజిక న్యాయ వారోత్సవాల దృష్ట్యా కార్మికుల నుంచి ఉద్యమ సంఘీభావ నిధి సేకరిస్తున్నట్లు సీఐటీయూ ప్రతినిధి ఎం.రామాచారి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రతినిధులు భిక్షపతి, మార్త పోశం, సంపత్, రవీందర్, అశోక్, రమేశ్ ఉన్నారు.

15న ఉచిత కంటి ఆపరేషన్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లయన్స్‌క్లబ్ విజన్ కేర్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో 15న ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ తెలిపారు. ఆపరేషన్ చేసుకునే వారికి ఉచిత రవాణా, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆధార్‌కార్డు, తెల్లరంగు రేషన్‌కార్డుతో రూ.220వెంట తెచ్చుకోవాలన్నారు.

బీపీ మండల్ వర్ధంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గౌడ్రైకాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గొర్రెకాపరుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నాయకుడు మారం తిరుపతి కోరారు. నాయకులు నాగరాజు, నర్సయ్య, సాగర్, రాజేశ్, లక్ష్మణ్, అంజియాదవ్, ఐలయ్య, కొమురయ్య, రఘు, సతీశ్ ఉన్నారు.

ముగిసిన స్పెషల్ క్వార్టర్ల కౌన్సెలింగ్


హాజరైన కార్మిక కుటుంబాలు

గోదావరిఖని: రోడ్డు విస్తరణలో కోల్పోతున్న క్వార్టర్ల స్థానంలో నూతన క్వార్టర్లను కేటాయించేందుకు ఆర్జీ–1 ఏరియా స్పెషల్ కౌన్సెలింగ్ శనివారం నిర్వహించారు. స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పలువురికి క్వార్టర్లు కేటాయించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, నాయకులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

సుల్తానాబాద్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 13, 14వ వార్డు (పూసాల)లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కాలనీలు శుభ్రంగా ఉంటే ఎలాంటి రుగ్మతలు దరి చేరవని, ప్రతి ఒక్కరూ విధిగా తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనంతో వచ్చిన సిబ్బందికి అందించాలని కోరారు. అనంతరం పూసాలలో బొడ్రాయి కోసం చేస్తున్న పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించి ట్యాంకు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. 14వ వార్డు కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, నాయకులు గాజుల రాజమల్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి


పూలమాల వేస్తున్న శంకర్

గోదావరిఖనిటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పి ఆచరించిన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని దళిత పరివర్తన సేన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ అన్నారు. పట్టణంలోని పవర్‌హౌస్‌కాలనీ శాఖ గ్రంథాలయంలో శనివారం దళిత పరివర్తన సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన బాటలో యువత ముందుండి దళిత ప్రగతిశీల పరివర్తనం తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. సింగరేణి టెక్నీషియన్ లతా సాగర్, నాయకులు అనిల్‌కుమార్, శనిగల శ్రీనివాస్, బచ్చల ప్రసాద్, ప్రదీప్‌కుమార్, చరణ్‌దీప్, కరణ్, శ్రీలక్ష్మి, సువర్ణ, ఎండీ ఉస్మా పాల్గొన్నారు.

15 నుంచి శ్రీలక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

జూలపల్లి: భక్తుల కోర్కెలు తీర్చే కోరమీసాల స్వామి పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు 15 నుంచి 24 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మండలంలోని పెద్దాపూర్ గుట్టపై వెలసిన శ్రీయోగానందుడు దక్షిణముఖ ద్వారం కలిగిన ఏకైక ఆలయంగా పేరు గాంచింది. 15 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు అధ్యయనోత్సవంతో ప్రారంభమై 19న స్వామివారి ఉత్సవమూర్తులకు తిరు కల్యాణోత్సవంతో పాటు 22న సాయంత్రం షకటోత్సవం, 24 తెల్లవారుజామున ఉత్సవమూర్తులకు ఆలయ వీధుల్లో రథోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు తాగునీరు, చలువ పందిళ్లు, విద్యుత్, వైద్యం, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ఈవో సదయ్య తెలిపారు.

శ్రీపాదరావు సేవలు మరువలేనివి


గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న నాయకులు


పాలకుర్తి: బసంత్‌నగర్‌లో..


పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు సేవలు మరువలేనివని పలువురు అన్నారు. నగరంలోని జనక్‌భవన్‌లో శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

జ్యోతినగర్: శ్రీపాదరావు వర్ధంతి ఎన్టీపీసీ రామగుండంలో నిర్వహించారు. మేడిపల్లి సెంటర్ సాయి సేవాసమితిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలని వెంకటరెడ్డి, ముసిపట్ల సాగర్‌రెడ్డి నివాళి అర్పించారు. 200మందికి అన్నదానం చేశారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శ్రీపాదరావు వర్ధంతి నిర్వహించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెలి రాజిరెడ్డి నివాళి అర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కుల దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్ కార్మికులకు అన్నదానం చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు సదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మునీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి ఉన్నారు.

జూలపల్లి: మండల యూత్ కాంగ్రెస్, మైనార్టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ముత్తారం: ముత్తారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేశనపల్లిలోని శ్రీపాదరావు విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పర్మినెంట్ కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ధర్మారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

చిన్నారులకు సర్టిఫికెట్స్



గోదావరిఖని టౌన్: నగరంలోని కల్యాణ్‌నగర్‌లోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు సర్టిఫికెట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాల ప్రిన్సిపల్ గాలి సునీత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం నేరుగా రైస్‌మిల్లులకే..



సుల్తానాబాద్: రైతులు పంట పొలాలను హార్వెస్టర్‌తో కోయిస్తున్నారు. కోసిన తర్వాత ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు వెళ్తే తేమశాతంతో ఇబ్బందులు పడతామని రైతులు నేరుగా రైస్ మిల్లులకు ట్రాక్టర్ల ద్వారా చేరవేస్తున్నారు. వర్షం వస్తుందని వాతావరణశాఖ చెప్పడంతో రైతులు ఆందోళన చెంది నేరుగా రైస్ మిల్లులకు చేరవేస్తున్నారు.